సాక్షి
కుమురం భీం

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



ప్రభుత్వ ఉద్యోగులూ.. బహుపరాక్!
పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండగా ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవు. 8లో▸



బెంగాలీల ఉగాది..
నేడు బెంగాలీలు నూతన సంవత్సరాదిని ఘనంగా జరుపుకోనున్నారు. సంప్రదాయాలను పాటిస్తూ, సంస్కృతి, విశ్వాసాల ప్రకారం వేడుకలు నిర్వహిస్తారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /26.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వాన కురిసే అవకాశముంది.

వడ్డీ మాఫియా..!



కాగజ్‌నగర్‌లో సోదా చేస్తున్న పోలీస్ అధికారులు

- జిల్లాలో యథేచ్ఛగా వడ్డీ దందా
- వందకు రూ.10 వడ్డీ వసూలు
- రోజుకు రూ.కోట్లలో వ్యాపారం
- జిల్లాలోని పలుచోట్ల సోదాలు
- పలువురిపై కేసులు నమోదు

కౌటాల: జిల్లాలో అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా చిట్టీలు నిర్వహిస్తూ, వడ్డీ వ్యాపారం చేస్తూ అమాయకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక వడ్డీకి అప్పు ఇస్తూ.. ఆస్తులు తాకట్టు పెట్టుకుంటున్నారు. చెల్లించని పక్షంలో తాకట్టు పెట్టిన ఆస్తులను జప్తు చేసుకుంటున్నారు. జిల్లాలో వడ్డీ వ్యాపారం మాఫియాగా మారింది. వడ్డీ వ్యాపారులు పేద, మధ్యతరగతి కుటుంబాలను పట్టి పీడిస్తున్నారు. శనివారం జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, రెబ్బెనలో వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు దాడులు నిర్వహించి పలువురిని అరెస్ట్ చేశారు.

అడ్డూఅదుపు లేకుండా..
జిల్లాలో వడ్డీ వ్యాపారుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అవసరాలను ఆసరాగా చేసుకుని ఇష్టానుసారం వడ్డీ వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజల రక్తం తాగుతున్నారు. అసలును మించి వడ్డీ చెల్లించినా.. ఇంకా మిగిలే ఉందంటూ దాడులకు తెగబడుతున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలు, పలు మండల కేంద్రాల్లో చోటు చేసుకుంటున్నాయి. ఇన్నాళ్లు పోలీసులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. సామాన్యులను నిలువునా ముంచుతున్నారు.

పల్లెలకూ విస్తరణ
పట్టణాల్లోనే కాకుండా వడ్డీ వ్యాపారం గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, రెబ్బెన, వాంకిడి మండల కేంద్రాల్లోనూ అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. చిరువ్యాపారుల జీవన విధానాన్ని సొమ్ము చేసుకునేందుకు వడ్డీ వ్యాపారులు అక్రమ దందాకు పాల్పడుతున్నారు. ఆటో ఫైనాన్స్‌లు నెలవారీ చిట్టీలు, లక్కీ డ్రాలతో అనేక మంది ప్రజలను నట్టేట ముంచుతున్నారు. డబ్బులు ఇవ్వడం ఆలస్యమైతే వారి కుటుంబ గౌరవాన్ని కించపరిచేలా అవమానిస్తున్న ఘటనలున్నాయి. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కౌటాలలో పలువురు చిట్టీ వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా ప్రజల సొమ్ముతో పారిపోయిన ఘటనలున్నాయి.

సోదాల కలకలం
జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ పట్టణం, రెబ్బెన మండల కేంద్రంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో శనివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. దీంతో వడ్డీ వ్యాపారం బాగోతం మరోసారి తెరమీదకు వచ్చింది. జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న చిట్టీలు, వడ్డీ వ్యాపారాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా అమాయక ప్రజలను జలగల్లా పీడిస్తున్న వారి కోరలు పీకుతున్నారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలపై వరుస ఫిర్యాదులతో తాజాగా జిల్లాలోని పలుచోట్ల పోలీస్ అధికారులు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై సోదాలు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

రూ.కోట్లల్లో దందా..
జిల్లాలో రకరకాల వడ్డీ వ్యాపారులు లావాదేవీలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం చేబదులుగా అప్పు ఇస్తే అనుమతి అవసరం లేదు. వ్యాపారం చేస్తే మాత్రం లైసెన్స్ ఉండాలి. కానీ, జిల్లా వ్యాప్తంగా అప్పులు ఇస్తున్న వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకున్నా వడ్డీ వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో ఏడాదికి వడ్డీ, అసలు చొప్పున చెల్లించాలనే నిబంధన ఉండేది. అది కూడా రూ.2 వడ్డీ అంటే అబ్బో అనుకునేవాళ్లు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. వారం వడ్డీ రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. అంటే రూ.లక్ష అప్పుగా తీసుకుంటే నెలకు రూ.10వేలు వడ్డీ చెల్లించాలి. ఒక నెల చెల్లించకపోతే దానికీ మళ్లీ వడ్డీ పడుతుంది. మరో నెల దాటితే ఇంటి మీద పడి గొడవ చేయడంతో పాటు దాడులకు తెగబడుతున్నారు. జిల్లాలో అడ్డూ అదుపు లేని వడ్డీ వ్యాపారంతో అప్పు తీసుకున్న వాళ్లు భయంతో వడ్డీల మీద వడ్డీలు చెల్లిస్తూ వీధిన పడుతున్నారు. వడ్డీ వ్యాపారం చేస్తున్న వ్యాపారులు ఎంతోమంది రూ.కోట్లకు పడగలెత్తుతుండడం గమనార్హం.

చివరి అవకాశం!

- ఓటు నమోదుకు మరో ఛాన్స్
- రేపటితో ముగుస్తున్న గడువు
- మే 13న పార్లమెంట్ ఎన్నికలు
- జిల్లా ఓటర్లు 4,55,437 మంది



కౌటాల: పార్లమెంట్ ఎన్నికలకు ముందు కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. ఓటింగ్ శాతం పెంచే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తోంది. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఓటరు నమోదు గడువు ఉండగా అర్హులంతా ఓటు నమోదు చేసుకుంటున్నారు.

జిల్లాలో 4,55,437 మంది ఓటర్లు
జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిలో ఆసిఫాబాద్‌లో మహిళా ఓటర్లు 1,14,056 మంది, పురుష ఓటర్లు 1,12,510 మంది ఉన్నారు. సిర్పూర్‌లో పురుష ఓటర్లు 1,14,484, మహిళా ఓటర్లు 1,14,359 మంది ఉన్నారు. జిల్లాలో గతేడాది నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నాటికి 4,53,538 మంది ఓటర్లున్నారు. ఎన్నికల కమిషన్ ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించింది. అప్పటినుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించింది. దీంతో జిల్లా ఓటర్ల సంఖ్య 4,55,437కు చేరింది. అంటే రెండు నెలల వ్యవధిలో జిల్లాలో కొత్తగా 1,899 మంది ఓటర్లు పెరిగారు. మే 13వ తేదీన ఎంపీ ఎన్నికలుండగా జిల్లాలో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

రేపటితో గడువు పూర్తి
సార్వత్రిక ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని వారికి మరో అవకాశం ఇచ్చింది. ఈ నెల 15వ తేదీ వరకు ఓటరు నమోదుకు గడువు విధించింది. ఇప్పటికే 18 ఏళ్లు నిండిన యువతీయువకులు, 2006 మార్చి 31వ తేదీలోపు జన్మించిన వారంతా కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశమిచ్చింది. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరుండి నివాసం మార్చుకోవడానికి, కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో మార్చుకోవడానికి అవకాశం కల్పించింది. ఇలాంటి వారంతా ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పార్లమెంట్ ఎన్నికల వేళ అర్హులందరికీ మరో అవకాశం కల్పించాలని నిర్ణయించి సోమవారం దాకా దరఖాస్తులు స్వీకరించనుంది. అర్హుల వివరాలతో ఓటర్ల అనుబంధ జాబితాను ఈ నెల 25వ తేదీన ప్రకటిస్తారు. ఆ ప్రకారం మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు.

ఓటు నమోదు ఇలా..
అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం-6లో పూర్తి వివరాలు నమోదు చేసి దరఖాస్తులను నేరుగా తహసీల్దార్ కార్యాలయాల్లో అందించాలి. ఆధార్‌కార్డుతోపాటు కరెంట్ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిలో ఏదైనా ఒకటి దరఖాస్తుకు జతచేయాలి. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) క్షేత్రస్థాయిలో వివరాలు పరిశీలించి ఓటరుగా నమోదు చేస్తారు. ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి వీలు కాకుంటే ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు.
http|||voters.eci.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ముందుగా ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6లో వివరాలు నమోదు చేసి ఆధార్ కార్డు, చిరునామా, పుట్టిన తేదీ, కుటుంబ సభ్యుల వివరాలు, కుటుంబ బంధం తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడమే కాకుండా దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే వీలుంటుంది. అనంతరం ఆన్‌లైన్ దరఖాస్తులను ఏఈఆర్వోలు పరిశీలించి ఓటరుగా నమోదు చేస్తారు. వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకునే ఛాన్స్ లేకపోతే స్మార్ట్‌ఫోన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా, ఓటు ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎలాంటి సందేహాలున్నా బీఎల్వోలను లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



అర్హులంతా ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం కల్పించింది. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి సందేహాలున్నా బీఎల్వోలను లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలి. ఓటు ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పుష్పలత, తహసీల్దార్, కౌటాల

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ అంతరాయం
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్, బజార్‌వాడి, హైకాజీనగర్, బజార్ ఏరియా, కుమురంభీమ్ చౌక్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సదాశివ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏఎస్సై

కెరమెరి: సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు వాహనాన్ని శనివారం మండలంలోని సాకడ చౌరస్తా వద్ద ఏఎస్సై బాల్‌సింగ్ తనిఖీ చేశారు. ఎమ్మెల్యే ఆదిలాబాద్ నుంచి కాగజ్‌నగర్ వెళ్తుండగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా వాహనాన్ని తనిఖీ చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



నినదిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మహనీయుల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందామని టీపీజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీంరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రెండోసారి అధికారంలో వచ్చిన బీజేపీ దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థను ఖూనీ చేస్తోందని ఆరోపించారు. మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని కర్ణాటకలో బీజేపీ నేత ప్రకటించడం సరికాదని పేర్కొన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు టీకనంద్, ప్రధాన కార్యదర్శి కార్తీక్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీపీజీఎస్ జిల్లా అధ్యక్షులు మాలశ్రీ నాయకులు శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట జెండా ఎగురవేశారు. అనంతరం జిల్లా ఐక్య గురుకుల రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే సంఘం యూటీఎఫ్ అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా అధ్యయనం చేసి యూటీఎఫ్ సేవలందిస్తోందని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు, ఉపాధ్యక్షుడు హేమంత్, కోశాధికారి రమేశ్, నాయకులు శ్రీనివాస్, నరేందర్, తిరుపతి, ఉపేందర్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ, అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణ సీఐ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శంకరయ్య, అగ్నిమాపక కేంద్రం అధికారి మురళీమోహన్‌రెడ్డి, సిబ్బంది అర్షద్, యుగేందర్, ఖలీల్ పాల్గొన్నారు.

అందరి దృష్టి ఆదిలాబాద్‌పైనే..



అభివాదం చేస్తున్న మురళీధర్‌రావు, ఎమ్మెల్యేలు ఏలేటి, పాయల్, హరీశ్‌బాబు, రామారావుపటేల్

- ఎంపీ సీటును గెలిపించి మోదీకి బహుమానంగా ఇద్దాం
- బీజేపీ ఎమ్మెల్యేలు ఏలేటి, పాయల్, హరీశ్‌బాబు, రామారావుపటేల్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఎనిమిది మంది ఉండగా.. అందులో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోనే నలుగురు ఉన్నారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రజల దృష్టి అంతా ఆదిలాబాద్ ఎంపీ స్థానంపైనే ఉందని బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, హరీశ్‌బాబు, రామారావు పటేల్ అన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహుమానంగా ఇద్దామని అన్నారు. ఆదిలాబాద్ పట్టణ శివారులోని ఓ గార్డెన్‌లో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల విజయ సంకల్ప సమ్మేళనం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జాతీయ నేత మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే, ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై లేదని విమర్శించారు. సీఎం చేస్తున్న అక్రమాలపై ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరినా ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో వారు చెబుతున్నట్లుగా 14 ఎంపీ స్థానాల్లో గెలిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని పేర్కొన్నారు. ఒకవేళ వారు అనుకున్నంత స్థానాల్లో గెలువకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సవాల్ విసిరారు. ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా పాలన సాగిస్తున్న నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిగా చేసేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తూ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని ఆ పదవి నుంచి దించాల్సిన అవసరం బీజేపీకి లేదని, కాంగ్రెస్‌కు చెందిన ఖమ్మం, నల్లగొండ బ్యాచే ఆయనను సీఎం పదవి నుంచి దించుతారని పేర్కొన్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. మరోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావడానికి కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై చేస్తు న్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పార్లమెంట్ ఆర్గనైజర్ అల్లపూర్ శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, పార్టీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్, డాక్టర్ శ్రీనివాస్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, ఆదినాథ్, నగేశ్ తదితరులున్నారు.

'గెలుపే లక్ష్యంగా పని చేయాలి'
కౌటాల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన నాయకులతో మాట్లాడారు. తలోడి చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోమవారం కౌటాలలో చేరికల కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా పార్టీల నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్‌లోనే రైతులకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని తెలిపారు. నాయకులు బండు, వెంకటేశ్, ఆనంద్, సందీప్, సురేశ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ త్యాగాల పార్టీ

- అమరుల త్యాగాల ఫలితంగా పదవులు పొందింది బీఆర్ఎస్
- జిల్లా అభివృద్ధి బాధ్యత నాదే
- సుగుణను ఎంపీగా గెలిపించాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మల్లేశ్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్: బీఆర్ఎస్‌లా కాంగ్రెస్ కుటుంబ పార్టీ కాదని, త్యాగాల పార్టీ అని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ అమరుల త్యాగాల ఫలితంగానే బీఆర్ఎస్ నాయకులు పదవులు అనుభవిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి సీతక్క హాజరై మాట్లాడారు. పేపర్‌బాయ్ స్థాయిలో ఉన్న వెడ్మ బొజ్జు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్ఎస్‌ను ఓడించినా మాజీ మంత్రి కేటీఆర్‌కు బుద్ధి రాలేదని, తనను కూడా ఓడించేందుకు కుట్ర పన్నాడని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లతో బీఆర్ఎస్ సర్కార్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శించారు. గత పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. పేదలకు భారమయ్యేలా గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, కేంద్రంలో రానున్నది ఇందిరమ్మ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంజేశారు. ఎన్నికల కోడ్ పేరుతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, జిల్లాలోని సమస్యలు పరిష్కరించి, గ్రామాలాభివృద్ధి చేయాల్సిన బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, నాయకులు చునార్కర్ వసంత్‌రావు, మునీర్ అహ్మద్, అనిల్‌గౌడ్, బాలేశ్‌గౌడ్, మసాదె చరణ్, గుండా శ్యాం, ఆసిఫ్‌మహ్మద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకులు
ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి తదితర మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మంత్రి సీతక్క కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్, గుండి ఎంపీటీసీ సభ్యుడు గాదెవేణి మల్లేశ్, రెబ్బెన జెడ్పీటీసీ సభ్యుడు వేముర్ల సంతోష్, వాంకిడి ఎంపీపీ ముండే విమలాబాయి, రెబ్బెన మండలం నంబాల సర్పంచ్ సోమశేఖర్, ఆత్మ చైర్మన్లు మారిశెట్టి రమేశ్, కొరట్కర్ రమేశ్ తదితరులున్నారు.

మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి
మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పోడుభూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి సీతక్కకు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశ శంకర్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మాలీల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మాలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రెబ్బెనలో పార్టీ కార్యాలయం ప్రారంభం
రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు వచ్చినప్పుడే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేవుళ్లు, మతాలు గుర్తుకు వస్తాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ముందుకుసాగుతోందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. సుగుణను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మండలాధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి దేవాజీ, నాయకులు అనిల్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, గోగర్ల రాజేశ్, కిషన్‌గౌడ్, సురేందర్‌రాజు, మురళి, హరీశ్, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, నాయకుడు ప్రకాశ్‌రావు తదితరులున్నారు.



మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

క్లుప్తంగా

ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్

జన్నారం: జన్నారం గ్రామ పంచాయతీకి చెందిన కడెం నీటి పారుదల శాఖ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ తొకల రాకేశ్ ఆత్మహత్యకు కారకులైన అదే శాఖలో పని చేస్తున్న సూపరింటెండెంట్, ప్రధాన నిందితుడు లింగాల ప్రభాకర్‌ను శనివారం అరెస్ట్ చేసి జ్యూడీషియల్ కస్టడికి పంపినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. రాకేశ్‌ను వేధింపులకు గురి చేయగా గత నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడి తల్లి సరోజన ఫిర్యాదు మేరకు 17న సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇన్ని రోజులు పరారీలో ఉండగా ప్రభాకర్‌ను పట్టుకుని అరెస్ట్ చేశామని తెలిపారు.

దోపిడీ కేసులో ఒకరి అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సీఐ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మ్యాక్ భవన్ వద్ద ఈ నెల 6న జరిగిన దోపిడీ కేసులో తప్పించుకు తిరుగుతున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. రాంనగర్‌కు చెందిన బొప్పు మల్లేష్ ఆటో కోసం ఎదురు చూస్తుండగా ఓ ఆటోలో ఇద్దరు వ్యక్తులు అతడిని ఎక్కించుకుని కత్తితో బెదిరించి రూ.4వేలు దోచుకున్నారని తెలిపారు. ఇద్దరిలో ఒకరిని ఇదివరకే రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు ధారంగుల రాజ్‌కుమార్‌ను శనివారం స్థానిక ఏసీసీ క్వారీ ప్రాంతంలో అరెస్ట్ చేశామని వివరించారు.

పేలిన ట్రాక్టర్ టైరు..

- డ్రైవర్ మృతి
- కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్న మృతుడి సోదరులు
- సారంగపూర్ మండలంలో ఘటన


దయాకర్(ఫైల్)

సారంగపూర్: ట్రాక్టర్ టైరు పేలడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతిచెందగా, అతని సోదరులు కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటన సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం నిర్మల్‌లోని వైఎస్సార్ కాలనీకి చెందిన దండ్ల దయాకర్ (21)స్థానికంగా ఓవ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆలూరు గ్రామ శివారులోని పంటపొలంలో రాళ్లు తొలగించడంతో వాటిని తీసుకుని గ్రామ శివారులో పాడేయడానికి ట్రాక్టర్‌లో వేసుకుని బయల్దేరారు. ఆయన వెంట సోదరులు దండ్ల సురేశ్, గంగాధర్ కూడా వెళ్లారు. కొంత దూరం వెళ్లాక ట్రాక్టర్ ముందు టైరు పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ కిందపడిన దయాకర్‌కు తీవ్ర గాయాలు కాగా, అతని సోదరులు కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. దయాకర్‌ను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులూ.. బహుపరాక్..!

- రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉంటే కఠిన చర్యలే..
- జిల్లా ఎన్నికల అధికారుల ప్రత్యేక దృష్టి
- ఉద్యోగ, ఉపాధ్యాయులు అప్రమత్తం..


కంట్రోల్‌రూమ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: పార్లమెంటు ఎన్నికల పోలింగ్ తేదీలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకుగానీ, పోటీలో ఉన్న అభ్యర్థులకుగానీ అనుకూలంగా వ్యాఖ్యలు చేసినా, సభలు సమావేశాల్లో పాల్గొన్నట్లు ఆధారాలున్నా కఠిన చర్యలు తీసుకోవడానికి ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకుగాను ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఎన్నికల సర్వేలైన్స్ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి.

సిద్దిపేట జిల్లాలో 106 మందిపై వేటు..

ఇటీవల సిద్దిపేట జిల్లాలో ఓ రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి నిర్వహించిన సమావేశానికి వెళ్లిన 106 మంది సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులపై ఎన్నికల అధికారి సస్పెన్షన్ వేటు వేశారు. ఎన్నికల ప్రవర్తన నియమాలని ఉల్లంఘించి ఒక రాజకీయ పార్టీ అభ్యర్థికి మద్దతుగా సమావేశానికి హాజరు కావడంతో ఎన్నికల సంఘం కొరడా ఝళిపించింది. ప్రత్యర్థి రాజకీయ పార్టీలవారు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఎన్నికల నిఘా విభాగం అధికారులు ఆ సమావేశానికి హాజరైన ఉద్యోగుల వివరాలు సేకరించి సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులువర్గాల్లో అలజడి మొదలైంది. ఎన్నికల వేళ ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిఘా బృందాలు సైతం ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శాశ్వత, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులందరూ దాదాపు 45 వేల వరకు ఉంటారని అంచనా. వీరు రాజకీయ పార్టీలకు మద్దతుగా నిలిచినా లేదా ఆత్మీయ సమ్మేళనాల పేరిట ఆయా పార్టీల సమావేశాలకు హాజరైనా, మద్దతుగా ప్రచారం నిర్వహించినా నిబంధనల మేరకు చర్యలు తీసుకునేలా అధికారులు నిఘా పటిష్టం చేశారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులు..

నిర్మల్	1,554
ఖానాపూర్	1,555
ముధోల్	1,584
బోథ్	1,472
ఆదిలాబాద్	1,412
ఆసిఫాబాద్	1,480
సిర్పూర్	1,432

అప్రమత్తంగా ఉండాల్సిందే...

ప్రభుత్వ శాఖల ఉద్యోగులు లేదా ఉపాధ్యాయులు ఇతర కాంట్రాక్టు పొరుగు సేవల సిబ్బంది ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదనే నిబంధనలు 1949, సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అమలులో ఉన్నాయి. ఈ చట్టంలోని సెక్షన్ 23 (ఐ) ప్రకారం వీరందరూ ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు ఇతర అనుబంధ ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసే అన్ని కేటగిరీలు, స్థాయిల్లోని ఉద్యోగులు, సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంటుందని నిబంధనలు తెలుపుతున్నాయి. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రతీ అధికారి ఉద్యోగి, సిబ్బంది తనవంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎలాంటి పక్షపాత వైఖరిని ప్రదర్శించకూడదు. ప్రభుత్వం సూచించే ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో ఉంది. అయితే సోషల్ మీడియాలో హద్దులు మీరి రాజకీయపక్షాలకు సంబంధించిన పోస్టులు పెట్టినా, పోటీలో ఉన్న అభ్యర్థులను కించపరిచేలా లేదా మద్దతుగా కామెంట్లు చేసినా తిప్పలు తప్పేలా లేవు. ఎన్నికల నిఘా బృందాలు, పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగం అధికారుల సమన్వయంతో తీక్షణమైన నిఘాపెట్టి పరిశీలన చేస్తున్నారు. వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టేలా మెసేజ్‌లు, ఫొటోలు, మార్ఫింగ్ వంటివి చేసినా కేసుల నమోదుతోపాటు ఉద్యోగం నుంచి సస్పెన్షన్ వేటువంటివి కూడా ఉండే అవకాశం ఉంది.

హద్దులు దాటితే అంతే..

- ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం చేయడం లేదా ఎదుటి పార్టీలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం చేయకూడదు.
- ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి సహకరిస్తున్నారని ఏ చిన్న ఆధారం దొరికినా వేటు పడుతుంది.
- సామాజిక మాధ్యమాల్లోనూ ఒక పార్టీకో లేదా అభ్యర్థిగా వ్యతిరేకంగానో, సానుకూలంగానో పోస్టులు పెట్టినా చర్యలు ఉంటాయి.
- ఉన్నత స్థానంలో ఉన్న ప్రభుత్వ అధికారి తన కిందిస్థాయి సిబ్బందికి అధికార దర్పంతో ఒక పార్టీకి లేదా ఫలానా అభ్యర్థికి మద్దతు తెలపాలని, సహకరించాలని సూచించకూడదు.

ఇంటి నుంచే ఓటు వేయొచ్చు

- వృద్ధులు, వికలాంగులకు అవకాశం
- ఈ నెల 25వరకు దరఖాస్తుకు గడువు


అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటరు(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల్లో వంద శాతం ఓటు హక్కు నమోదుకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఓ వైపు ఓటర్లను చైతన్యం చేసేందుకు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తోంది. మరోవైపు 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల్లో అచేతన స్థితిలో ఉన్న వారు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఈ విధానాన్ని అమలు చేసి విజయవంతం చేశారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లోనూ ఈ విధానం ద్వారా మరింత పోలింగ్ శాతాన్ని పెంచేలా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. తహసీల్దార్లు, బీఎల్‌ఓలు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకునేలా చైతన్యం చేశారు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మంచిర్యాల, చెన్నూర్, రామగుండం, పెద్దపల్లి, మంథని, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 7,87,140 మంది పురుష ఓటర్లు, 8,05,755 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 101 మంది ఉండగా మొత్తంగా 15,92,996 మంది ఉన్నారు. ఇక నియోజకవర్గ పరిధిలో 85 ఏళ్లు దాటిన వారు 8,692 మంది, దివ్యాంగులు 35,036 మంది మొత్తంగా 43,791 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల అధికారులు ఫారం–12డీ దరఖాస్తులు అందిస్తున్నారు. దరఖాస్తులను ఈ నెల 18 నుంచి 25వరకు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో దాదాపు 800 వరకు దరఖాస్తుల పంపిణీ జరిగినట్లు తెలుస్తోంది. ఓటర్లకు ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి రాగానే ఇంటి నుంచే రహస్య బ్యాలెట్ విధానం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నారు.

25లోగా దరఖాస్తు చేసుకోవాలి

పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని పరిస్థితుల్లో ఉన్న వారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్రం ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్నవారు, మంచానికి పరిమితమైన వారు ఫారం–12డీ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఈ నెల 18నుంచి 25లోపు దరఖాస్తు చేసుకోవాలి.
– రాములు, ఆర్డీఓ, మంచిర్యాల

గుర్తింపు పత్రం ఇవ్వాలి

- ఎన్నికల కోడ్ పేరిట యాజమాన్యం అత్యుత్సాహం
- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్: ఎన్నికల్లో గెలిచిన తమకు యాజమాన్యం వెంటనే గుర్తింపు పత్రం ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘంగా గెలిచి నాలుగు నెలలు అవుతున్నా గుర్తింపు సంఘంగా అధికార పత్రం అందించలేదని తెలిపారు. సింగరేణిలో ఎన్నికల తర్వాత రాజకీయ జోక్యం పోతుందనుకుంటే మరింత పెరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని యాజమాన్యం ఐఎన్టీయూసీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతోందని విమర్శించారు. గత గుర్తింపు సంఘం హయాంలో అక్రమంగా అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌లో పని చేస్తున్న వారిని తిరిగి పంపాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది కార్మికులు అనారోగ్యం, ఇతర కారణాలతో బాధపడుతున్నా పట్టించుకోలేదని తెలిపారు. తాము యజమాన్యానికి లేఖ రాసినా ఎన్నికల కోడ్ పేరుతో జాప్యం చేస్తోందని, వారందరిని తక్షణమే తిరిగి వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, నాయకులు మురళి చౌదరి, చంద్రమోహన్, ఎం.సారయ్య, అఫ్రోజ్ ఖాన్, మల్లికార్జున్, శ్రీకాంత్, యాదగిరి, నర్సింగరావు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు

- ఇద్దరిపై కేసు నమోదు


కాగజ్‌నగర్: పోలీసులతో చర్చిస్తున్న ఏఎస్పీ


దస్నాపూర్‌లో తనిఖీ నిర్వహిస్తున్న సీఐ, సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఇద్దరు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురు వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఎస్పీ సురేశ్‌కుమార్ సీఐకి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సీఐ సతీశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇద్దరు వ్యాపారుల ఇళ్లపై ఏకకాలంలో పోలీసులు దాడులు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఫైనాన్స్‌లు నడుపుతున్నట్లు గుర్తించారు. పట్టణానికి చెందిన ఇద్దరి నుంచి ప్రామిసరీ నోట్లు, 32 వివిధ బ్యాంకుల బ్లాంక్ చెక్కులు, 22 అప్పు ఒప్పంద బాండ్ పేపర్లు సీజ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌కు చెందిన తపాసె శ్రీనివాస్, బ్రాహ్మణవాడకు చెందిన తణుకు దత్తాత్రి వద్ద రూ.14.70లక్షల నగదు సీజ్ చేశారు. ఇద్దరిపై 420 కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా ఫైనాన్స్ కంపెనీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

కాగజ్‌నగర్‌లో ముగ్గురిపై..

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై శనివారం అడిషనల్ ఎస్పీ ఆర్ ప్రభాకర్‌రావు, డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పట్టణంలోని ఓల్డ్ కాలనీకి చెందిన సాబీర్ ఇంట్లో సోదా చేసి ప్రామిసరీ నోట్లు, నాన్‌జ్యుడీషియల్ బాండ్లు, బ్లాంక్ చెక్కులు, రూ.3,01,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. త్రైబానగర్‌కు చెందిన చిదిరాల రాజశేఖర్ ఇంట్లో సోదా చేసి ఒక ల్యాప్‌టాప్‌తో పాటు 250 మంది అప్పు తీసుకున్న పత్రాలు, రూ.3,78,600 నగదు స్వాధీనపరుచుకున్నారు. సంతోష్ ఇంట్లో సంతకం లేని చెక్కులు, సంతకం ఉన్న చెక్కులు, నాన్‌జ్యుడీషియల్ బాండ్లు, ఖాళీ జ్యుడీషియల్ బాండ్లు, బ్యాంకు పాస్ బుక్కులు, ప్రామిసరీ నోట్లు, ఏటీఎం కార్డులు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. అమాయక ప్రజల నుంచి అక్రమంగా అధిక వడ్డీలు వసూలు చేస్తూ వేధిస్తున్నారని, వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

రెబ్బెన మండలంలో ఇద్దరిపై..


రెబ్బెనలో సోదాలు నిర్వహిస్తున్న ఎస్సై

రెబ్బెన: మండలంలో అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంతో పాటు గోలేటిలో ఏకకాలంలో ఫైనాన్స్‌లు, వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు నిర్వహించారు. గోలేటి టౌన్‌షిప్‌లో పగిడి మహేందర్ వద్ద రెండు బ్లాంక్ చెక్కులు, మండల కేంద్రానికి చెందిన మోడెం సుదర్శన్‌గౌడ్ వద్ద ఒక ప్రామిసరీ నోట్ లభించాయి. అనుమతి లేకుండా అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించి వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి సీతక్కకు వినతుల వెల్లువ


సీతక్కకు సమస్యలు వివరిస్తున్న శ్రీనివాస్

రెబ్బెన: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలానికి వచ్చిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతులు వెల్లువెత్తాయి. మండల కేంద్రంలో మంత్రిని కలిసిన అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు విడుదల చేయాలని కోరారు. గంగాపూర్‌లో బెల్లంపల్లి ఏరియా ఐఎన్టీయూసీ నాయకులు సీతక్కను కలిసి ఏరియాలో నెలకొన్న సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని, ఎన్నికల కోడ్ ముగియగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీతక్క హామీ ఇచ్చారు.

స్థలం కేటాయించాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని హుడా మజీద్‌కు సంబంధించిన శ్మశానవాటిక స్థలాన్ని గతంలో ప్రభుత్వం ఆక్రమించుకుందని, ఆ స్థలానికి బదులు మరోచోట ఐదెకరాల స్థలం కేటాయించాలని ఎంఐఎం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. మైనార్టీ ఫంక్షన్‌హాల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు ఎండీ సల్మాన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్జల్ తదితరలున్నారు.

చపరాడ ఆలయంలో ముస్లింల పూజలు


చపరాడ ఆలయంలో ముస్లిం కుటుంబం

చింతలమానెపల్లి: మండలంలోని చాపరాడ ప్రశాంత్‌ధాం ఆలయంలో శనివారం ఓ ముస్లిం కుటుంబం ప్రత్యేక పూజలు చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన అజీజుద్దీన్ మనుమడు రిషాక్ అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఎంతకూ నయం కాకపోవడంతో చపరాడ ప్రశాంత్ ధాం కార్తీక్ మహారాజ్ చిత్రపటానికి మొక్కుకున్నారు. దీంతో చిన్నారి రిషాక్ ఆరోగ్యం కుదుటపడిందని వారు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా అజీజుద్దీన్ తన కుటుంబంతో చపరాడ ప్రశాంత్ ధాం హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయంలో వీరికి ఆలయ సిబ్బంది, భక్తులు సాదర ఆహ్వానం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాంట్రాక్టు పనులకు సింగరేణి మట్టి


ఓసీ నుంచి రైల్వేలైన్‌కు తరలిస్తున్న మట్టి

కాసిపేట: సింగరేణి సంస్థకు చెందిన ఓపెన్‌కాస్టుల నుంచి ప్రజావసరాలకు మినహా కాంట్రాక్టు పనులకు మట్టి తరలించే అవకాశం లేకున్నా మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్‌కాస్టు నుంచి రైల్వే కాంట్రాక్టు పనులకు భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. గత మూడు రోజులుగా మట్టిని తరలించడం చర్చనీయాంశంగా మారింది. మట్టిని విక్రయించడం, ఇవ్వడం మైనింగ్ నియమాల్లో లేదు. సింగరేణి అధికారులు అనుమతులు ఉన్నాయని తెలుపగా సింగరేణి మైనింగ్ ఏరియాలో అనుమతులు ఇస్తే తీసుకున్న వారు రాయల్టీ ఎవరికి కట్టాలి, సింగరేణికి మట్టిని అమ్మి డబ్బులు తీసుకునే హక్కులేదు. మైనింగ్ ఏరియాలో ఎన్ని క్యూబిక్ మీటర్లు తరలించింది ఎవరు నమోదు చేస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కిరాణాషాపులో చోరీ

కుభీర్: మండల కేంద్రంలోని రశీద్ కిరాణా షాపులో శుక్రవారం రాత్రి దొంగతనం జరి గింది. గుర్తు తెలియని వ్యక్తులు షాపులో చొరబడి గల్లాలోని నగదు, ఒక నూనె డబ్బా, వా ణి, గణేశ్ బీడీ కట్టలు, సిగరేట్ డబ్బాలు ఎత్తుకెళ్లారు. షాపు కుడివైపు ఉన్న షెటర్ పైకి ఎత్తి లోనికి చొరబడ్డారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్ టీం వారు వచ్చి వేలు ముద్రలు సేకరించారు. షాపు యజమాని రయీస్ 50 వేల విలువైన సరుకులు చోరీ అ యినట్లు చేసిన ఫిర్యాదు మేరు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: మండలంలోని బంగారుతండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ హసిలిబాయితోపాటు 50 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి సుగుణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్మానాయక్, లాకవత్ తిరుపతి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ధ్వంసం చేస్తున్న పందులు


పంటపొలాలను ధ్వంసం చేస్తున్న పందులు

భీమారం: మండల కేంద్రంలోని సుంకరిపల్లి శివారులో రైతులు పండిస్తున్న వరి పంటలపై ఊరపందులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో కోతకు వచ్చిన పంటలు నాశనం అవుతున్నాయి. ప్రతీరోజు పందులు వచ్చిన సమాచారం తెలిస్తే తాము వెళ్లి బయటకు పంపిస్తున్నామని రైతులు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని పందుల బారి నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుడిహత్నూర్: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఈనెల 9న తెల్లవారు జామున జాతీయ రహదారి 44పై దేవాపూర్ చెక్‌పోస్టు వద్ద కారు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన జిల్లా కేంద్రానికి చెందిన బానోత్ అక్షయ్ (22) నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. అక్షయ్ జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అక్షయ్ అకాల మరణంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కాగజ్‌నగర్‌లో ఆపరేషన్ చబుత్ర


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్ రూరల్: నేరాలను అరికట్టేందుకు డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌చౌక్, ఎన్టీఆర్ చౌక్, లారీ చౌక్‌లలో ఆపరేషన్ పోలీస్ చబుత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాల యజమానులకు జరిమానా విధించారు. అర్ధరాత్రి తిరుగుతున్న 50 మంది యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ శంకరయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మాలమహానాడు కార్యవర్గం ఎన్నిక

పాతమంచిర్యాల: తెలంగాణ మాలమహానాడు కార్యవర్గం ఎన్నికలు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కంబాల రాజేష్ ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాలలో నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పొట్ట మధుకర్, జాతీయ ఉపాధ్యక్షుడిగా దమ్మ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడిగా మాలేం చిన్నయ్య, చెన్నూర్ మండల అధ్యక్షుడిగా తోకల రమేష్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్ అందజేశారు.